క్లుప్తంగా

దుప్పట్లు, దోమతెరలు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు బుడగ జంగాల కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వర్యాన ఎన్నారై బాలినేని సీతారామకృష్ణ, గుడిపూడి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీర పనేని రమేష్ సహకారంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు, దోమ తెరలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై సీతారామకృష్ణరాజు, హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపించాలని, సంచార విధానాన్ని మాని పిల్లలను చదివించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి నిర్వాహకులు దాసరి విజయబాబు, కో–ఆర్డినేటర్ వి.అనిల్ కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి




అచ్చంపేట: సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎంఈవో వి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఇద్దరు నిరుపేద బీటెక్ విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం అచ్చంపేటలో ల్యాప్‌టాప్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న రవి విహితకు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేల విలువ చేసే ల్యాప్‌టాప్, ఫీజు కోసం రూ.60వేలు ఇస్తున్నట్లు స్నేహ హస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తెలిపారు. గుంటూరు ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదవే పాకాలపాటి శృతి అనే విద్యార్థికి ల్యాప్‌టాప్, కాలేజీ ఫీజు నిమిత్తం రూ.45వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చదువులు ఆగిపోకూడదన్న లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తుందని కరిముల్లా బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మా శౌరైడ్డి, స్నేహ హస్తాలు సభ్యులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు

శావల్యాపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెరుకూరి శ్రీనివాసరావు అన్నారు. సంక్రాంతికి ఆయన స్వగ్రామానికి వచ్చిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వర్సిటీ ఉత్పత్తి చేసిన వరి వంగడాలు భారతదేశంలో 40 శాతం మంది రైతులు సాగు చేస్తున్నారని వెల్లడించారు. మన రాష్ట్రంలో సాగు చేసే వేరు శనగ విత్తనాల ఉత్పత్తి చేసినట్లు వివరించారు. పురుగు మందుల వాడకం తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నరసరావుపేట ఈస్ట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపట్టాభిరామ స్వామి దేవాలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణమండపంలో మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీఅయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొత్తూరి వెంకట శివవేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవా రి కల్యాణోత్సవంలో గజలక్ష్మీ భక్త బృందం అ న్నమాచార్య సంకీర్తనలు ఆలపించి భక్తులను అలరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వేంకటేశ్వరరావు, ప్రవల్లిక సత్యం, ఎస్ఈసీ కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వక్కలగడ్డ సురేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు

- 26వ తేదీ నుంచే హోమ పూజలు ప్రారంభం
- రథ యాత్రకు సర్వం సిద్ధం
- మహిళా భక్తులతో ప్రధాన కలశ శోభయాత్ర
- ప్రారంభం కానున్న ప్రత్యేక పూజలు

పిడుగురాళ్లరూరల్: పల్నాడు ప్రాంతానికే పెద్ద పండుగ శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల. నిరంతరం హోమాలతో మూడు రోజులపాటు స్వామివారి పూజా కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. జనవరి 28వ తేదీ అంటేనే పిడుగురాళ్ల పట్టణానికి ఓ పెద్ద పండుగ రోజు, చుట్టాలు, బంధువులు, కులమతాలకు అతీతంగా పిడుగురాళ్ల పట్టణానికి చేరుకుంటారు. ఈ నెల 26వ తేదీ నుంచే హోమ పూజలు మొదలవ్వనున్నాయి. ఈ మూడు రోజులు స్వామవారి కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. 26వ తేదీన మహా గణపతి పూజ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మహా యజ్ఞం పూజలు వైభవంగా నిర్వహిస్తారు. అలాగే 27వ తేదీన తెల్లవారుజామున 5 గంటలకే శ్రీ ప్రసన్నాంజనేయస్వామివరి మూల విరాట్‌కు అభిషేకాలు, పంచ ముఖ హనుమాన్ విగ్రహానికి అష్టోత్తర కలశ పంచామృత బ్రాహ్మణులచేత కలశాభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే శ్రీ స్వామి అమ్మవారి దేవస్థానం నుంచి మహిళా భక్తులతో కలశ శోభయాత్రను పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వరకు నిర్వహిస్తారు. పలు రకాల కలశాలతో మహా కుంభాభిషేకం, ప్రధాన కలశశోభయాత్ర నిర్వహిస్తారు. ఈ కలశ శోభయాత్రలో సుమారు 3 వేల మంది మహిళలచే మహా కుంభ కలశ యాత్ర నిర్వహిస్తారు. భక్తులకు ఈ శోభయాత్ర కన్నుల విందుగా ఉంటుంది. అలాగే ఈ నెల 28న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం మధ్యాహ్న సమయంలో మహారథోత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించటానికి, రథయాత్రలో పాల్గొనేందుకు యువకులు, భక్తులు విశేషంగా హాజరు కావడం ఇక్కడ ఆచారంగా మారింది. రథయాత్రలో పాల్గొని రథం తాడును లాగితే వారుకోరుకున్న కోరికలను ఆంజనేయ స్వామి నెరవేరుస్తాడని భక్తులకు ప్రధాన విశ్వాసం.



సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

ఒక పిడుగురాళ్ల పట్టణమే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి, జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి నుంచి భక్తులు విశేషంగా హాజరై స్వామివారి కల్యాణం, రథోత్సవంలో పాల్గొంటారు.

భక్తుల కొంగుబంగారం స్వామివారు...

పల్నాడు ప్రాంత ప్రజలకు స్వామివారి కల్యాణం, రథోత్సవం భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతుంది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం నిర్మాణం 2006లో ప్రారంభమైంది. 2007 జనవరి 28వతేదీన అత్యంత వైభవంగా విగ్రహ ప్రతిష్ట పూర్తి అయింది. అప్పటి నుంచి గత పదహేను ఏళ్లుగా ప్రతి ఏటా మూడు రోజులపాటు పూజలు, హోమ యజ్ఞాలు, అభిషేకాలు, పుణ్య దంపతులచే పూజలు వంటివి నిర్వహిస్తూ ఉంటారు. 2015లో రథాన్ని నిర్మించారు. 2011లో రథశాలను ఏర్పాటు చేశారు. 2014లో సుమారు 50 అడుగుల ఎత్తుతో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2015లో గాలిగోపురం నిర్మాణం, 2016లో అద్దాల మండపం ఏర్పాటు వంటివి చేశారు. స్వామివారి కల్యాణం ఒక రాష్ట్రమే కాకుండా ఇతర రాష్ట్రాలలో తెలియాలనే ఉద్దేశ్యంతో అప్పటి ఆలయ కమిటీ సభ్యులు 2015లో హెలికాప్టర్‌తో రథయాత్రకు, పంచముఖ ప్రసన్నాంజనేయ స్వామివారి విగ్రహానికి పూలవర్షం కురిపించి



యాత్రకు ముస్తాబవుతున్న రథం

ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురులు చర్చించుకునేలా ఈ పూలవర్షం నిలిచింది. ఈ విధంగా ప్రతి ఏటా స్వామివారి కల్యాణ మహోత్సవానికి నూతన నిర్మాణాలు చేపట్టి రథోత్సవం, కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజలందరికి ఈ తిరునాళ్ల పెద్ద పండుగ కావడంతో ప్రభుత్వ పాఠశాలకు, ప్రైవేటు వ్యాపార సముదాయాలకు సెలవు ప్రకటించడం ఇక్కడ అనవాయి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



ముస్తాబవుతున్న పంచముఖ ప్రసన్నాంజనేయస్వామి భారీ విగ్రహం

తీగా మారింది. ప్రతి ఏటా వేల సంఖ్యలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఈ రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునేందుకు భారీ బలగాలను దించుతారు. విద్యుత్ శాఖాధికారులు ముందుగా ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ వైర్లను తొలగిస్తారు. రథయాత్ర ముగిసిన అనంతరం తిరిగి విద్యుత్ సరఫరాను అందిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజారులతో హోమ గుండాలను ఏర్పాటు చేయించి పూజలు నిర్వహిస్తారు.

రేపు విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

వెల్దుర్తి: మాచర్ల నియోజక వర్గ పరిధిలోని ఏపిసిపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారులు ఈ నెల 19, 20, 21 తేదీల్లో మాచర్ల పట్టణంలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బహిరంగ వినియోగదారుల అభిప్రాయాలు సేకరించనున్నట్లు మంగళవారం విద్యుత్‌శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిసిపిడిసిఎల్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటైల్ ధరల పై విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆదాయ అవసరములు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మాచర్ల పట్టణంలో స్థానిక విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను కార్యక్రమంలో పాల్గొని తెలుపవలసిందిగా కోరారు. 10:30గం''ల నుంచి మధ్యాహ్నం 1గం'' వరకు, మధ్యాహ్నం 2గం''ల నుంచి 4:30గం''ల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన కోతుల పట్టివేత

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పలు వార్డుల్లో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో మంగళవారం కోతులను పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. గత మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు పట్టణంలోని ఆయా వార్డుల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయడంతో మున్సిపల్ రమణబాబు కోతులు పట్టే వారిని పిలిపించి యుద్ధప్రాతిపదికన నాలుగు రోజుల నుంచి కోతులు పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు 13, 14, 15, 16 వార్డుల్లో సుమారు 200 ల కోతులను పట్టుకుని బోనుల్లో వేసినట్లు తెలిపారు. ఈ కోతులను సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు. గతంలో కుక్కలను పట్టివేసి నల్లమల్ల అడవిలో వదలడం జరిగిందన్నారు. త్వరలో రోడ్ల పై అడ్డంగా తిరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆవుల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.

అనుమతులు లేనందున బలకట్టు నిర్వహించ వద్దు

డీఎస్పీ జయరాం ప్రసాద్

మాచవరం: జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు లేనందున ఏపీ వైపు నుంచి బల్లకట్టును నిర్వహించ వద్దని నిర్వాహకులకు గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్ తెలియజేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మాచవరం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం గోవిందాపురం వద్ద బల్లకట్టు రేవును సందర్శించారు. బల్లకట్టు నిర్వాహణకు తెలంగాణా వైపు నుంచి మాత్రమే అనుమతులు ఉన్నందున అటు వైపు నుంచి ప్రజల్ని, వాహనాలను రవాణా చేయవచ్చని, ఏపీ నుంచి అనుమతులు లేనందున ఇటు వైపు నుంచి వాహనాలను గానీ, ప్రజల్ని గానీ బల్లకట్టు ద్వారా తెలంగాణా వైపుకు తీసుకెళ్లవద్దని తెలియజేశారు.



గోవిందాపురం వద్ద బల్లకట్టును పరిశీలిస్తున్న డీఎస్పీ జయరాం ప్రసాద్

బల్లకట్టు రేవు వద్ద ప్రతి రోజు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ వైపు నుంచి తెలంగాణా వెళ్లేందుకు ప్రజలు ఎవరూ రావద్దని, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు తెలియజేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎస్.కోటయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్యం

డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాన్ని దగ్గర చేయటమే ప్రభుత్వం యొక్క లక్ష్యమని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కేవీ ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డిలు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటికి ప్రభుత్వ వైద్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వైద్యాన్ని అందించి ప్రజలకు వైద్య సదుపాయాలను అందించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. గ్రామంలో ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం పొందిన గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామంలో 330 మందికి



అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి

వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏడుకొండలు, శౌరీలు, సురేశ్‌కుమార్, ఏఎన్‌ఎంలు రమణకుమారి, భారతి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పిడుగురాళ్ల: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ ఎం. మదుసూధన్‌రావు తెలిపారు. పట్టణంలోని కళ్లం టౌన్ షిప్ సమీపంలోని పొలాలకు వెళ్లే కరాలపాడు డొంక సమీపంలో దుర్వాసన వస్తుండడంతో కొంత మంది రైతులు వెళ్లి చూసే సరికి ఇక్కడ గుర్తు తెలియని మృతదేహం ఉబ్బి ఉంది. సమాచారాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మృతదేహం సుమారు 3, 4 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. మృతుని నల్లరంగు ఫ్యాంట్, తెల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 35, నుంచి 40 సంవత్సరాల లోపు ఉంటుందని పట్టణ సీఐ తెలిపారు. అయితే మెడలో టవల్ కూడా ఉందని తెలిపారు. మృతుని వివరాలు, మృతికి సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మధుసూదన్‌రావు తెలియజేశారు.

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల



ప్రత్యేక పూజలో పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలోని శ్రీపునీత అంతోనివారి చర్చి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సుమారు 125 సంవత్సరాల పైగా చరిత్ర కలది. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్లకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్లలో భాగంగా ఉదయం 5గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు వై.థామస్ ఆధ్వర్యంలో దివ్యపూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. నల్లపాడు విచారణ గురువు కె.ఇన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువు వై.థామస్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం 4 గంటలకు బాణాసంచా కాలుస్తూ గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు చర్చిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి



ప్రథమ బహుమతి అందజేస్తున్న దృశ్యం



యడ్లపాడు.. విజేతలతో అతిథులు, నిర్వాహకులు

శావల్యాపురం: క్రీడాల్లో గెలుపు– ఓటములు సహజమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లోని విజేతలకు నగదు బహుమతులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ అంకారావు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి దాతలు, గ్రామస్తుల సహకారంతో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి శావల్యాపురం ఫ్రెండ్స్ యూత్ రూ.10,116, ద్వితీయ బహుమతి ఉప్పరపాలెం రూ. 7,116, మూడో బహుమతి రూ.4,116 అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్ణా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జవంగుల బాబు, కొణతం ఎరుకల రెడ్డి, చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు పురిమెట్ల ఆజీం, నాయకులు మలిశెట్టి నరేష్, కమిటీ సభ్యులు తోట ప్రసన్నాంజనేయులు, డి.మస్తాన్, కాజా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

యడ్లపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని పీఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు నూతలపాటి కాళిదాసు చెప్పారు. యడ్లపాడు హనుమాన్ షటిల్ యూత్ ఆధ్వర్యంలో 4వ ఏడాది సంక్రాంతి క్రీడా పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించారు. సీనియర్, జూనియర్, బాలబాలికలకు వేర్వేరుగా జరిగాయి. సీనియర్స్ విభాగంలో పి.సుబ్బారావు, వై.వెంకటేశ్వర్లు, జూనియర్స్–16లో కె.అఖిల్, ఎం.ధర్మతేజ, అండర్ –14లో లలిత్, సాయిచరణ్, బాలికల విభాగంలో పి.కావ్య,



దొండపాలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఎం.గాయత్రి విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుడమి బిల్డర్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు, రామారావు, నంబూరి శ్రీనివాసరావు, కల్లూరి విజయ్‌కుమార్, నిర్వాహకులు కల్లూరి వాసు, పోపూరి సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో మూడురోజులు పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. సంబరాలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. పోటీల్లో చిన్నారులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో డాక్టర్ పేరం రాజనందరెడ్డి, డాక్టర్ పేరం రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచి జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజనందరెడ్డి మాట్లాడుతూ సంస్కృతిని ప్రతిబింబించేలా సంస్కృతి సంబరాలను నిర్వహిస్తున్న యువకులను అభినందించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

హనుమత్ మాల దీక్ష ప్రారంభం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్‌దీక్షా ధారణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. మండల దీక్షలో భాగంగా భక్తులు దీక్ష చేపట్టారు. సుమారు 60 మందికి పైగా భక్తులు హనుమత్ మాల ధరించారు.

నేడు మోడల్ పరీక్ష

క్రోసూరు: ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా జరిగే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు బుధవారం నరసరావుపేట వాసవీ డిగ్రీకళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి

సత్తెనపల్లి: పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 పని దినాలు కల్పించాలని, రూ.600 కూలీ నిర్ణయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు కూలీలకు అనేక రకాల ఇబ్బందులు తెచ్చిపెట్టాయన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ కార్మికులు వలస పక్షుల్లా అయిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. తమిళనాడు, కేరళ,



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ పథకం అమలవుతున్నాయని అలాగే మన రాష్ట్రంలో కూడా పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలకు సత్తెనపల్లిలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళ, బుధవారాల్లో శిక్షణా తరగతుల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దళితుల, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేపడతామన్నారు. అందులో భాగం గానే ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పల్నాడు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేడ వెంకటేశ్వర్లు, జమండ్లమూడి భగత్, కొమ్ముల నాగేశ్వరరావులు ఉన్నారు.

